## క్లుప్తంగా

### అధిక ధరలకు అమ్మితే చర్యలు



కౌడిపల్లి ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని ఏఓ స్వప్న తెలిపారు. బుధవారం కౌడిపల్లి, నాగ్సాన్‌పల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో పలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాక్‌తో పాటు రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే అమ్మాలన్నారు. కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని చెప్పారు. రైతులకు సరిపడ జీలుగు, జనుము విత్తనాలు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు.

### 11 నుంచి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని ఎల్లమ్మ ఆలయ 13వ వార్షికోత్సవాలు ఈనెల 11 నుంచి జరుగుతాయని నర్సాపూర్ పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఆలయ వార్షికోత్సవం వాల్ పోస్టర్‌ను గౌడ సంఘం సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని, 12న బోనాల ఊరేగింపు ఉంటుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలు జయప్రదం చేయాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, సంఘం సభ్యులు సత్యం గౌడ్, చిన్న అంజిగౌడ్, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, రోగులు

రామాయంపేట(మెదక్): మండలంలోని తొనిగండ్ల గ్రామంలో బుధవారం మేడ్చల్ మెడిసిటీ ఆస్పత్రివారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, పరీక్షలతో పాటు చెవి, ముక్కు, గొంతు, వరిబీజం, ఇన్ఫెక్షన్, చర్మ సమస్యలు, మోకాళ్ల నొప్పులు తదితర రోగులకు వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా రోగులకు మందులు అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని డాక్టర్లు పేర్కొన్నారు. డాక్టర్లు రాజేశ్, శివకుమార్, నితీష, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, గ్రామ కార్యదర్శి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

### వన దుర్గమ్మకు వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటాన్ని బహూకరిస్తున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మకు బుధవారం హైదరాబాద్ వనస్థలిపురంకు చెందిన కానుగుల అరవింద్ వెండి కిరీటం బహూకరించారు. 575 గ్రాముల ఈ కిరీటం రూ. 68 వేలు ఉంటుందని వారు వెల్లడించారు. ఈ కిరీటాన్ని ఏడుపాయల దేవస్థాన కార్యాలయంలో ఆలయ ఉద్యోగి ప్రతాపరెడ్డికి అందజేశారు. ఈ మేరకు ప్రతాప్‌రెడ్డి దాతలను అభినందించారు.

### నేడు పేటలో విద్యుత్ సరఫరా నిలిపివేత

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీష్‌బాబు తెలిపారు. చిన్నశంకరంపేట, కామారం, చందంపేట, రుద్రారం గ్రామాలతో పాటు ఇండస్ట్రీస్‌లైన్‌కు గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విషయం గమనించి సహకరించాలని కోరారు.

# మొక్కల సంరక్షణ అందరిది

- రేంజ్ అటవీ అధికారి విద్యాసాగర్

రామాయంపేట(మెదక్): మొక్కల సంరక్షణ అందరిదని, అడవుల అభివృద్ధికి ప్రజల సహకారం చాలా అవసరమని రేంజ్ అటవీ అధికారి విద్యాసాగర్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం రేంజీ అటవీ అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు అటవీప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. తాము నాటిన మొక్కలను సంరక్షిస్తామని అన్నారు. కార్యక్రమంలో శాఖ సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి**

టేక్మాల్(మెదక్): పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని ఏపీఓ పాల్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని మల్కాపూర్ గ్రామంలో అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువు కట్టపై గుంతలు తీసి మొక్కలు నాటి కూలీలతో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావి తరాల మనుషుల మనుగడ సాధించాలంటే ఇప్పటి నుంచే మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు.



రామాయంపేటలో మొక్కలు నాటిన అటవీ అధికారులు

అందరూ మొక్కలు నాటాలన్నారు. ఈ తరంలోనే సరైన ఆక్సిజన్, గాలి లేక శ్వాస తీసుకోలేని విపత్కర పరిస్థితులు మనమే ఎదుర్కోనాల్సి వస్తుందన్నారు. ప్రతీ ఏడాది తీవ్రమైన వేడిమి తట్టుకోలేని పరిస్థితులు ఉన్నాయని, ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి, మన భావి తరాలకు మంచి వాతావరణం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ అనిత, ఈసీ బాలరాజ్, టీఏ గంగారాం తదితరులు ఉన్నారు.



మల్యాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

# మోదీతోనే దేశం అభివృద్ధి

నర్సాపూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశానికి నిస్వార్థంగా సేవ చేస్తున్నందునే దేశప్రజలు బీజేపీకి మూడోసారి పట్టం కట్టారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ చెప్పారు. మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు విజయం సాధించడంతో ఆయన పలువురు నాయకులతో కలిసి బుధవారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు అనేక రంగాల అభివృద్ధికి మోదీ కృషి చేశారని వివరించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు చీదరించుకుంటున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యారన్నారు. కార్యకర్తలు, నాయకుల కృషికి ప్రజలు అండగా నిలిచి రఘునందన్‌రావును గెలిపించారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. సంబరాల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, పార్టీ నర్సాపూర్ కన్వీనర్ రమణరావు, పార్టీ కౌన్సిలర్లు సురేష్, బుచ్చేష్, యాదగిరి, నాయకులు ఆంజనేయులుగౌడ్, ఓంకార్, సతీష్‌యాదవ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈటలకు పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

**ఈటలకు సన్మానం**

మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌ను పార్టీ కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్‌తో పాటు నాయకులు బుధవారం కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ దుర్గప్రసాద్ తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల్లో భాగంగా పాంబండ, ఉసిరికపల్లి, ఎదుల్లాపూర్, భీమ్లా పంచాయతీ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు గమనించాలని సూచించారు.

### నేడు శనైశ్చరాలయంలో ప్రత్యేక పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శనైశ్చరస్వామి ఆలయంలో గురువారం శనైశ్చరజయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శనైశ్చరస్వామి జయంతిని పురస్కరించుకొని ఆలయంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, 11మహానదుల జలాలతో అభిషేకం, తైలాభిషేకం, అర్చన తదితర పూజలు, అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని చెప్పారు.

### నేటి నుంచి బడిబాట

పెద్దశంకరంపేట(మెదక్): బడిబాట కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు మండల నోడల్ అధికారి వెంకటేశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి 19 వరకు బడిబాట నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలన్నారు.

### అక్రమ మట్టి తరలింపు

అడ్డుకున్న యువకులు



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న పాలాట యువకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పాలాట గ్రామంలోని తిమ్మనకుంటలోంచి అక్రమ మట్టి రవాణాలను అడ్డుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కొంత మంది గ్రామ తిమ్మానా కుంటలోంచి అక్రమంగా మటిని తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులను పంపించి అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్నట్లు తెలిపారు.

# సేవలను సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): జిల్లా సహకార బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కృష్ణకర్ అన్నారు. బుధవారం శివ్వంపేటలో డీసీసీబీ సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకంలో 10 ఏళ్ల చిన్నారులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. నెలకు 600 నుంచి 2500 వరకు డిపాజిట్ చేసే పథకం ఉందని చెప్పారు. ఈ నెలఖరు వరకు ఖాతా తెరచి రెండు లక్షల బీమా సదుపాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కృష్ణకర్

# ప్రారంభానికి సిద్ధమవుతున్న 'సొసైటీ'



ప్రారంభానికి సిద్ధమవుతున్న మహ్మద్‌నగర్ సొసైటీ కార్యాలయం నూతన భవనం

కౌడిపల్లి(నర్సాపూర్): సొంత భవనం లేక ఇబ్బందులు పడ్డ మహ్మద్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాలనికి నూతన భవనం నిర్మాణం పూర్తవ్వడంతో ఇబ్బందులు తీరనున్నాయి. ప్రస్తుతం సొసైటీ గోదాం గ్రామంలో ఉండగా కార్యాలయం కౌడిపల్లిలో అద్దె భవనంలో ఉంది. దీంతో సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దివ్య మహిపాల్‌రెడ్డి కృషితో మహ్మద్‌నగర్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన గల ఎనేగుట్ట స్థలంలో రూ. 54లక్షలతో సొసైటీ భవన నిర్మాణ పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించారు. ప్రస్తుతం పూర్తి అవడంతో ప్రారంభానికి సిద్ధమవుతుంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో గోదాలం కోసం నాలుగు షెటర్లు నిర్మించగా పై అంతస్తులో కార్యాలయం కోసం నిర్మించారు.

### 108 అంబులెన్స్ సేవలు భేష్

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ 108 అంబులెన్స్‌తో పాటు 102 సేవలు భేష్‌గా ఉన్నాయని 108 ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్, ఈఎంఈ మహేశ్ అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని 108 అంబులెన్స్‌తో పాటు 102 వాహనాలను తనిఖీ చేశారు. రెండు వాహనాల సేవలకు సంబంధించి రికార్డులను, వాహనాల కండిషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సైతం 108, 102 సేవలపై ఆరా తీశారు. రెండు వాహనాల్లో పని చేసే పైలట్లు, టెక్నీషియన్స్, మెడికల్ సిబ్బంది సేవలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రజలు 108, 102 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పైలట్ రమేశ్, ఈఎంటీ వెంకటేశ్ ఉన్నారు.



అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం మేనేజర్

## సంక్షిప్త వార్తలు

**◆ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం**

పెద్దశంకరంపేట(మెదక్): కేంద్రంలో మరోసారి అధికారం చేపడుతున్న బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే మరోసారి అధికారంలోకి వచ్చేలా చేశాయన్నారు. రాబోయే రోజుల్లో గ్రామ గ్రామాన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్‌కుమార్, కృష్ణ తదితరులు ఉన్నారు.

**◆ ఆరాధన మహోత్సవం**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గంగాయిపల్లిలో కొలువైన ఓం ఫాజిల్ నగర్ అప్పగారి ఆశ్రమంలో గురువారం అర్ధ సంవత్సర ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం పవిత్ర పూజలతో పాటు సాయత్రం దీపాలంకరణ, ఖవ్వాలి, భజన, పుష్పలంకరణ ఉంటుందని ఆశ్రమ అప్పగారు నసీరొద్దీన్ చిష్తి (నర్సింలు) తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**◆ బీసీ బిడ్డపై బీఆర్‌ఎస్ కుట్రలు**

చిన్నశంకరంపేట(మెదక్): బీసీ బిడ్డపై బీఆర్‌ఎస్ కుట్రలు చేసి కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును ఓటమిపాలు చేశారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నార్సింగి ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ టెలికాం బోర్డు సభ్యులు రాజేష్ ఆరోపించారు.

**◆ ఎల్‌ఓసీ అందజేత**

నర్సాపూర్: పేదలకు అత్యవసర వైద్యం కోసం ఎల్‌ఓసీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. ఆమె బుధవారం తన నివాసంలో కౌడిపల్లి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జైపాల్‌కు ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.లక్ష యాభై వేల ఎల్‌ఓసీని అందజేశారు.

**◆ నూతన ఎంపీతో బీజేపీ నాయకులు**



మనోహరాబాద్(తూప్రాన్): పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావులను బీజేపీ మండల నాయకులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. వీరితో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు మల్లేశ్, నాయకులు చంద్రశేఖర్, జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌యాదవ్, జగన్‌గౌడ్, మహేశ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన

అల్లాదుర్గం(మెదక్): సైబర్ నేరాలపై ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. బుధవారం అల్లాదుర్గంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరి వద్ద స్మార్ట్ ఫోన్ ఉండటంతో అవగాహన లేక ఇష్టం వచ్చిన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడంతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని తెలిపారు. లోన్ ఇస్తామని చెబితే నమ్మొద్దని, ఆన్‌లైన్ లోన్ల వేధింపులతో ఎంతో మంది చనిపోయారని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ దేవిదాస్, స్థానికులు పాల్గొన్నారు.

**జాగ్రత్తగా ఉండాలి**

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు సైబర్ నేరాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ.శంకర్ అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో సైబర్ జాగృత దివస్ సందర్భంగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు, లింక్‌లు పంపి ఓటీపీలు చెప్పొద్దన్నారు.



పెద్దశంకరంపేట(మెదక్): సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శంకర్

# పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించండి



శేరీల గ్రామంలో బడిబాట నిర్వహిస్తున్న అంగన్‌వాడీ నిర్వాహకులు



తూప్రాన్:చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ ఇందిర

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి

వెల్దుర్తి(తూప్రాన్): మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. బుధవారం వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరీలా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం టీచర్ దేవలత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పిల్లలు వారి తల్లిదండ్రులతో కలిసి గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్న ప్రాసన నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించడం ద్వారా ఆరోగ్యకరమైన పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించబడుతుందని అన్నారు. పిల్లలను ఆట వస్తువులతో ఆడించడం ద్వారా వారికి మానసిక స్థితి మెరుగుపడుతుందన్నారు. చిన్నారులకు మెరుగైన ఆరోగ్యం, మంచి విద్యతో వారి భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ కృష్ణవేణి, ఏఎన్‌ఎం స్రవంతి పాల్గొన్నారు.

తూప్రాన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో బడిబాట కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్నారులతో సమావేశం నిర్వహించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సూచించారు. కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో పాటు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్ ఇందిర పేర్కొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యసాయం కోసం ఎదురు చూపు

- మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదం
- వెన్నుపూస దెబ్బతిని మంచం పట్టిన సాయిప్రసాద్



చందాపూర్ గ్రామానికి చెందిన సాయి ప్రసాద్

చిన్నశంకరంపేట(మెదక్): మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతిని నడవలేని పరిస్థితిలో నరకయాతన పడుతున్న యువకుడు వైద్య సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామానికి చెందిన వడ్ల కృష్ణ, బాలమణి కుమారుడు సాయిప్రసాద్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పెట్రోల్‌పంప్‌లో విధులు ముగించుకొని రాత్రి సమయంలో బంధువుల ఇంటికి వెళ్తూ.. కాళేశ్వరం కాల్వ తవ్వకాలతో రోడ్డుకు అడ్డంగా పోసిన మట్టిని గమనించక రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతింది. దీంతో తల్లిదండ్రులు వైద్య కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. ఉన్న కొద్ది పాటి పంట పొలం కూడా అమ్మి వైద్యం చేయించారు. తండ్రి దినసరి కూలి చేస్తూ.. ఫిజియోథేరపి, డ్రెస్సింగ్, మందుల కోసం ఖర్చుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. దినసరి కూలి దొరకని సమయంలో ఆర్థిక ఇబ్బందులతో రోజువారి వైద్యం అందించలేకపోతున్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సాయి ఫోన్‌నంబర్ 89192 50880 డబ్బులు పంపించి వైద్యం కోసం ఆర్థికసాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ప్రాణాంతకంగా భారీగుంతలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని వివిధ గ్రామాల్లో చెరువులు, కుంటల్లో ఉన్న జేసీబీ గుంతలు నేడు ప్రాణాంతకంగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఆయా చెరువులు, కుంటలు నీటితో నిండితే గుంత లోతు తెలియక నీట మునిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు గతంలో మండలంలో చోటు చేసుకున్నా.. గుంతలు పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా యంత్రాలతో మట్టి, మొరం, ఇసుక తవ్వకాలతో ఆయా ప్రాంతాల్లో ప్రమాదకర గుంతలు ఏర్పడుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపల వేటతో పాటు, బట్టలు ఉతకడానికి మహిళలు, స్నానం చేయడానికి చిన్నారులు, ఇతర అవసరాలకు వెళ్లిన పలువురు మృత్యువాత పడుతున్నారని వాపోయారు. మండలంలోని కొప్పులపల్లి, హస్తాల్‌పూర్, వెల్దుర్తి, తదితర గ్రామాల్లో చిన్నారులు, యువతీ, యువకులు నీటి గుంతల్లో పడి మునిగి చనిపోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. మిషన్ కాకతీయ పథకం కింద చేపట్టిన పూడికతీత పనులతో పాటు పలు అవసరాలకు చెరువులు, కుంటల్లో జేసీబీ యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి మట్టిని తరలించి విక్రయిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు వాపోతున్నారు. ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారిన గుంతలను మరో ప్రమాదం చోటుచేసుకోకముందే పూడ్చి వేయించాలని వారు విజ్ఞప్తి చేశారు.



హకింపేట డ్యాంలో మొరం తీయడంతో ఏర్పడిన గుంత

# బీజేపీ విజయోత్సవ ర్యాలీ



రామాయంపేటలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు

జిల్లా వ్యాప్తంగా మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలుపుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు బుధవారం ఆయా పట్టణాల్లో, గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు టపాకాయలు కాలుస్తూ, నృత్యాలు చేశారు.



పాపన్నపేటలో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు



తూప్రాన్‌లో..